# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 65 | విశాఖపట్నం | 5-12-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 65 | VISAKHAPATNAM | 5-12-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...
ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు
సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
9516171797, 9849349934


## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం

# 6 కంపెనీలకు ఆమోదం



**అమరావతి, పతాకం న్యూస్:** ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద 6 కంపెనీలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. పెట్టుబడులపై పోర్టల్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని నిర్ణయించారు. నిర్ణీత కాలపరిమితిలో ఎంవోయూల అమలుకు వీలుగా చర్యలు చేపట్టాలని తీర్మానించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 13వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, పీ నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్ వర్చువల్‌గా హాజరయ్యారు. అనంతరం మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేశ్ మీడియాతో మాట్లాడతూ సీఐఐ సదస్సు, అంతకుముందు ఒప్పందాల్లో 50 శాతం మేర ప్రక్రియ మొదలైనట్లు తెలిపారు. విశాఖ పరిధిలో రూ.1.69 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రక్రియ మొదలైందని అమరావతి పరిధిలో రూ.87 వేల కోట్లు, తిరుపతి పరిధిలో రూ.73 వేల కోట్ల పెట్టుబడులకు ప్రక్రియ మొదలైందని మంత్రులు వెల్లడించారు. తాజా సమావేశాల్లో రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిందని 7.62 కోట్ల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. 45 రోజుల్లో క్షేత్రస్థాయిలో అమలయ్యేలా కార్యాచరణ రూపొంది స్తామని చెప్పారు. రూ.13.25 లక్షల కోట్లకు సంబం ధించి ఎంవోయూలు జరిగాయని పెట్టుబడుల ద్వారా 16.13 లక్షల మందికి ఉపాధి కలగనుందని మంత్రులు స్పష్టం చేశారు. దావోస్ ఫోరమ్‌కు ముందే వీలైనన్ని శంకుస్థాపనలు జరగాలని ఎస్ఐపీబీ నిర్ణయించిందని రూ.1000 కోట్లకు పైగా పెట్టుబడులకు డెడికేటెడ్ అధికారిని ప్రభుత్వం నియమిస్తుందని మంత్రులు చెప్పారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పర్యాటక రంగంలో రూ.21 వేల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయని వెల్లడించారు. విద్యుత్ రం గంలో రూ.4.54 లక్షల కోట్లు, ఇండస్ట్రీస్, కామర్స్‌లో రూ.2.02 లక్షల కోట్లు, ఐటీ రంగంలో రూ.1.22 లక్షల కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్‌లో రూ.8,519 కోట్లు, సీఆర్‌డీఏకు సంబంధించి రూ.45 వేల కోట్లు, మారి టైమ్ బోర్డు కింద రూ.1.6 లక్షల కోట్ల మేర ఎంవో యూలు కుదిరాయని మంత్రులు తెలిపారు.

## తిరుమల లడ్డుపై చంద్రబాబుది

# దుష్ప్రచారం: జగన్



**తాడేపల్లి, పతాకం న్యూస్:** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని వైసీపీ అధినేత జగన్ స్పష్టం చేశారు. దీనిని పూర్తిగా దుష్ప్రచారంగా అభివర్ణించిన ఆయన, దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. దేవుడంటే భక్తి, భయం లేని చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "కల్తీ నెయ్యి ఆరోపణలు ఉన్న ఆ ట్యాంకర్లు ప్రసాదం తయారుచేసే పోటులోకి వెళ్లాయా? అందుకు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా?" అని సూటిగా ప్రశ్నించారు. టీటీడీలోకి వచ్చే ప్రతి నెయ్యి ట్యాంకర్‌ను కఠినమైన తనిఖీలకు గురిచేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ, టీటీడీ సొంత ల్యాబ్‌లో కూడా పరీక్షలు పాస్ అయితేనే ఆ నెయ్యిని వినియోగానికి స్వీకరిస్తారని వివరించారు.నాణ్యతా ప్రమాణాలు పాటించని ట్యాంకర్లను వెనక్కి పంపడం ఒక సాధారణ ప్రక్రియ అని జగన్ తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలో 17 సార్లు, తమ ప్రభుత్వ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిప్పి పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇంతటి పటిష్టమైన భద్రతా, నాణ్యతా ప్రమాణాలు అమల్లో ఉండగా కల్తీ జరిగిందని ఎలా అంటారని నిలదీశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన ప్రసాదంపై ఆరోపణలు చేస్తున్నారని జగన్ అన్నారు.

# జగన్‌పై రవీంద్ర ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ గురువారం నిర్వహించిన సుదీర్ఘ మీడియా సమావేశంపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నాలుగు గోడల మధ్య మూడు గంటల పాటు ప్రెస్ మీట్ పెట్టి జగన్ రెడ్డి ఏం సాధించారు?" అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉంటే ఓర్వలేక, బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో వచ్చి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తుంటే జగన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. "ఆయనకు సంబంధించిన నాలుగు ఛానళ్లను పెట్టుకుని హంగామా చేస్తున్నారు. అందరు జర్నలిస్టులను పిలిచి, వారు వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేక తప్పించుకుంటున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వంటి నరరూప రాక్షసుడిని దేవతామూర్తిగా, జోగి రమేశ్ లాంటి వారిని గొప్ప వ్యక్తులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారా? తిరుమల పరకామణిలో స్వామివారి హుండీ కొట్టేసిన వారిని వెనకేసుకొచ్చి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు" అని మండిపడ్డారు. మహిళలపై దాడులు చేసిన వారిని (తరువాయి 2వ పేజీలో)



**పార్లమెంటులో హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై వాడివేడిగా చర్చ**

2లో



5లో

**ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత**

రాజపత్రం విడుదల చేయనున్న కేంద్రం

# రాష్ట్రాభివృద్ధికి కూటమి నాయకుల ఐక్యతే మూలం: పవన్



**చిత్తూరు, పతాకం న్యూస్:** కూటమిలోని మూడు పార్టీల నాయకుల ఐక్యతే రాష్ట్ర ప్రగతికి మూలమని, ఇదే స్ఫూర్తి మరో 15 ఏళ్ల పాటు కొనసాగితేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నాయకుల మధ్య చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్‌లు ఉంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం చిత్తూరు రెడ్డిగుంట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "వర్షించని మేఘం, శ్రమించని మేధావి ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. అలాగే, కూటమి ప్రభుత్వానికి ఇంతటి ప్రజాబలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు తేలేకపోతే మన పదవులన్నీ నిష్ప్రయోజనమే" అని అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పుల కోసమే రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు ప్రారంభించామని వివరించారు. ఏళ్ల తరబడి ప్రమోషన్లకు నోచుకోని 10 వేల మంది పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామని గుర్తుచేశారు. "ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా నాకు పదోన్నతి విలువ (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY / తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## నామినేటెడ్ గవర్నర్ల 'నిష్పాక్షికత'

గవర్నర్లు అధికార జోక్యానికి పాల్పడతారనేది ముందుగా ఊహించలేకపోయారు. గవర్నర్ల పాత్ర మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, తదనంతరం ఆ తీర్పు మీద రాష్ట్రపతి సలహా కోరుతూ సుప్రీంకోర్టుకు నివేదించడం, దరిమిలా సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన సలహాశౌ%వంటి పరిణామాలన్నీ మరోసారి రాజ్యాంగ స్ఫూర్తి మీద చర్చకు దారితీశాయి. రాజ్యాంగ అసెంబ్లీ రాజ్యాంగ తుది ప్రతిని ఆమోదించే సందర్భంలో జరిగిన చర్చల స్ఫూర్తి అక్షర రూపంలో మన రాజ్యాంగంలో ప్రతిఫలించింది. మన రాజ్యాంగం 1949 నవంబరు 26న ఆమోదం పొందగా తాజాగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు అదే రోజున వెలువడడం యాదృచ్ఛికంగా జరిగిందని భావించాలి. గవర్నర్ల పాత్ర మీద రాజ్యాంగ అసెంబ్లీలో నాణ్యమైన, విలువైన చర్చలు జరిగాయి. స్వతంత్ర భారత దేశంలో గవర్నర్లకు ఉండే అధికారాలు, వారు పోషించాల్సిన పాత్ర మీద అనేక ప్రశ్నలు తలెత్తాయి. ప్రతి సందర్భంలోనూ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ జోక్యం చేసుకుని రాజ్యాంగ డ్రాఫ్ట్ కమిటీ అనేక జాగ్రత్తలు తీసుకుని ఏ దృష్టితో గవర్నర్ల అధికారాలు, పాత్రను రూపొందించిందో వివరణలు ఇచ్చారు. తుది ముసాయిదాలో వాటికి చోటు కల్పించామని స్పష్టం చేశారు.

నామినేటెడ్ గవర్నర్ల నిష్పాక్షికత గురించి రాజ్యాంగసభ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా నామినేట్ అయ్యే గవర్నర్లు కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఈ వ్యవహారం అంతా 1935 నాటి చట్టం ద్వారా నియమించబడిన ప్రాదేశిక గవర్నర్ల వ్యవస్థకన్నా ఏమాత్రం భిన్నంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ల వ్యవస్థ 'వైస్రాయి నామినీ'లకు నకలుగా మారకుండా చూడాలని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నరు పదవి చేపట్టేవారు సందేహాలు, అనుమానాలకు అతీతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు 1947లోను 1949లో రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఉద్దేశించిన సదస్సులోను వెలిబుచ్చిన సందేహాలకు డాక్టర్ అంబేద్కర్ సమాధానం ఇస్తూ 'గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది తప్ప ఇందులో రాష్ట్రాలకు ఏ పాత్ర లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. కానీ గవర్నర్లు రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకే నడుచుకోవాలని నేను నిస్సందేహంగా చెప్పగలను. గవర్నరు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి మినహా మరొకటి కాదు' అని వివరించారు. 'రాజ్యాంగపరంగా నియమించబడే ఈ గవర్నర్లు అచ్చంగా రాజ్యాంగ నిర్వహణకు మాత్రమే పరిమితమని నేను నొక్కి చెప్పదలిచాను. వారు పార్లమెంటరీ వ్యవస్థ సజావుగా నడిచేలా చూడాలే తప్ప ఎన్నికయిన మంత్రిమండలికి శత్రువుల్లా వ్యవహరించకూడదు' అని స్పష్టం చేశారు. రాజ్యాంగ అసెంబ్లీలో తీవ్రమైన చర్చ జరిగిన మరో అంశం గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాల గురించి. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు అనేకమంది ఈ అధికారాల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇది 1935 నాటి చట్టం కన్నా భిన్నంగా లేదని ఎత్తి చూపారు. మరోసారి డాక్టర్ అంబేద్కర్ ఈ సందేహాలను నివృత్తి చేశారు. గవర్నర్ల విచక్షణాధికారాల పేరిట తిరిగి 1935 నాటి భూతానికి ప్రాణం పోస్తున్నాం అన్న భావన పొరపాటు అవగాహన. ఆ నాటి చట్టం గవర్నర్లకు దేనినయినా తోసిపుచ్చే విశేషాధికారాలు కల్పించింది. కానీ మన రాజ్యాంగం అలాంటి అధికారాలు కల్పించలేదు' అని స్పష్టం చేశారు. కానీ సభ్యులు పదే పదే అవే అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో 'సభ్యులు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలకు మించి ఆలోచించ వద్ద'ని నిష్కర్షగా చెప్పారు అంబేద్కర్. 'గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు లేవు. గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాలూ పరిమితమయినవే' అని వివరించారు.'పరిమిత విచక్షణ' అంటే ఎన్నికల అనంతరం మెజారిటీ శాసనసభాపక్షం నాయకుడిని ఎన్నుకుంటే ఆ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని కోరడం, నూతన ప్రభుత్వంతో ప్రమాణ స్వీకారం చేయించడం వంటి రాజ్యాంగంలో పొందుపరిచిన నిర్దిష్టమయిన విధులే తప్ప మరొకటి కాదు' అని కూడా అంబేద్కర్ పేర్కొన్నారు. అయితే ఇవాళ ప్రతిపక్ష రాజకీయ పార్టీల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ఏ స్థాయిలో అధికార జోక్యానికి పాల్పడుతున్నారో చూస్తే ఆనాడు డాక్టర్ అంబేద్కర్ ఇదంతా ఊహించి ఉండరని తేటతెల్లం అవుతున్నది.

## 180 విమానాలు రద్దు చేసిన ఇండిగో- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అతిపెద్ద దేశీయ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో కార్యకలాపాలల్లో మరోసారి పెద్ద ఎత్తున అంతరాయం ఏర్పడింది. పైలట్ల డ్యూటీలు, విశ్రాంతి వ్యవధులపై అమల్లోకి వచ్చిన కొత్త నిబంధనలు కారణంగా సిబ్బంది కొరత తీవ్రమైంది. దీంతో గురువారం మూడు ప్రధాన విమానాశ్రయాల నుంచి 180కిపైగా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. ఫలితంగా వేలాది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల సమాచారం ప్రకారం, గురువారం ఒక్క రోజే దేశంలో మూడుచోట్ల భారీగా విమానాలు రద్దయ్యాయి. ముంబయి విమానాశ్రయంలో 86 విమానాలు, బెంగళూరులో 73 విమానాలు, దిల్లీలో 33 విమానాలు రద్దయినట్టు తెలుస్తోంది. ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వర్గాలు వెల్లడించాయి. ఇండిగో 180 విమానాలకుపైగా రద్దు చేయగా, ఇది ఇటీవలి కాలంలో ఎయిర్‌లైన్‌కు సంభవించిన అత్యంత పెద్ద అంతరాయం. డిసెంబర్ 3న ఇండిగో ఆన్ టైమ్ పనితీరు ఆరు ప్రధాన విమానాశ్రయాల్లో 19.7 శాతంకి పడిపోయింది. ఇది డిసెంబర్ 2న నమోదైన 35 శాతం తో పోలిస్తే దాదాపు సగానికి తగ్గుదల. పైలట్లు అందుబాటులో లేకపోవడం వల్ల విమానాల షెడ్యూల్ మొత్తం కుదేలైందని విమానయాన వర్గాలు చెబుతున్నాయి. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ రెండో దశ అమలులోకి రావడంతో పైలట్లకు తగిన విశ్రాంతి, డ్యూటీ పరిమితులపై కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అయితే, రెండు సంవత్సరాల ప్రిపరేషన్ టైమ్ ఉన్నప్పటికీ ఇండిగో సరైన నియామకాలు చేయలేదని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సిబ్బంది తక్కువగా ఉండటం వల్లే ఇండిగో ఇంత భారీ స్థాయిలో షెడ్యూల్‌ను నిర్వహించలేకపోతుందని పైలట్లు అంటున్నారు. కొత్త నిబంధనలు అమలైన తొలి వారంలోనే ఇలా భారీ అంతరాయాలు రావడంతో విచారణ ప్రారంభించింది. ఇండిగో ఎందుకు ఇన్ని విమానాలు రద్దు చేస్తోంది? పరిస్థితిని ఎలా అదుపులోకి తెస్తుంది? ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు ఏ చర్యలు తీసుకుంటుంది? అనే వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున ఇండిగో కార్యకలాపాలు నెమ్మదించాయి. టెర్మినల్స్?లో పెద్ద క్యూలు కనిపించాయి. డిస్?ప్లే బోర్డుల్లో మార్పులు కనిపిస్తూనే ఉన్నాయి. సిబ్బంది నుంచి స్పష్టమైన వివరాలు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొందరు పిల్లలతో, వృద్ధులతో వచ్చిన వారు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది.

## 'పని ఒత్తిడి తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవాలి': ఎస్ఐఆర్ పై సుప్రీం



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారుల ఆత్మహత్య ఘటనలు జరగడంపై సుప్రీంకోర్టు స్పందించింది. పని ఒత్తిడితో ఇబ్బందులు ఎదురైనప్పుడు అదనపు సిబ్బందిని నియామించుకోవాలని అన్ని రాష్ట్రాలను సూచించింది. ఎస్ఐఆర్‌ను గడువులోని పూర్తి చేయాలని ఈసీ బూత్ స్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తోందన్న పిటిషన్‌పై సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. పని ఒత్తిడి కారణంగా బూత్ స్థాయి అధికారులు రాజీనామా చేయడంతో పాటు పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారని పిటిషనర్ తరుపున న్యాయవాది కోర్టుకు వివరించారు. గడువులోగా పని పూర్తి కాకపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని ఎన్నికల సంఘం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం చట్ట ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సంఘంతో కలిసి కొన్ని పనులు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే వర్క్‌లోడ్ కారణంగా అధికారులు ఇబ్బంది పడుతుంటే అదనపు సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. ఒకవేళ ఏ ఉద్యోగికైనా ఎస్ఐఆర్ విధుల నుంచి మినహాయింపు కావాలని ఏదైనా కారణం చూపిస్తే వేరే ఉద్యోగిని ప్రత్యామ్నాయంగా నియమించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది

## పార్లమెంటులో హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై వాడివేడీగా చర్చ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను గురువారం ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారు అని ఆమె ప్రశ్నించారు. దీని ద్వారా పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు. ఈ బిల్లు చర్చ సందర్భంగా బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

## విశాఖ ఉక్కు ఉద్యోగులు, నిర్వాసిత కార్మికులను ఆదుకోండి



**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖ ఉక్కు ఉద్యోగులు, నిర్వాసిత కార్మికుల సమస్యలు తీర్చాలని స్టీలు టిఎన్టియుసి ప్రతినిధులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ రావు కి మొరపెట్టుకున్నారు. గురువారం గాజువాక టిడిపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. మీ నాయకత్వంలో కేంద్ర మరియు రాష్ట్ర కూటమి ప్రభుత్వం సుమారు 14 వేల కోట్ల రూపాయల ప్యాకేజీని విశాఖ ఉక్కు కు కేటాయించి నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఉక్కు ఉద్యోగులకు ప్రొడక్షన్ ఆధారిత జీతాలు ఇస్తానన్నడం కార్మికుల హక్కులకు, చట్టాలకు వ్యతిరేకం. దీన్ని పరిశీలించి మాకు తగు న్యాయం చేయాలని కోరుతున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములు, ఇల్లు త్యాగాలు చేసిన నిర్వాసితులు ఉపాధి పొందుతూ అన్యాయంగా తొలగించబడ్డారు. నిర్వాసిత కార్మికులను తక్షణమే జాయిన్ చేసుకోవాలని వారి ఆధార్ కార్డు బ్లాక్ తొలగించాలని కోరారు. ఉక్కు ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించి రాబోవు పండగలకు మా కుటుంబాలలో వెలుగును నింపాలని అభ్యర్థించారు. పై సమస్యలపై పల్లా శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాజువాక సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనువాసరావు, స్టీల్ టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర కుమార్, గాజువాక టి ఎన్ టి యు సి అధ్యక్షులు అంజిబాబు, ప్రధానకార్యదర్శి కోన సోమినాయుడు, బడే చిన్నారావు, కొల్లి శివ నాగేశ్వరరావు, తురుబిల్లి శ్రీను, గండేపల్లి రాము, ఎస్ వి అప్పలరాజు, పల్లా మనోజ్, జి కుటుంబరావు, కాంట్రాక్టు యూనియన్ నాయుకులు కోన రాజు తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## జగన్‌పై రవీంద్ర ఫైర్

, గంజాయి సరఫరా చేసే వైసీపీ నాయకులను జగన్ సమర్థించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఛీ కొట్టినా జగన్‌కు సిగ్గురావడం లేదని, ఆయన నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. “2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో అధికారం చేపట్టింది. వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ ముందుకెళుతుంటే, సూపర్ సిక్స్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు” అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. “64 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నాం. ఏడాదికి రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లు జమ చేశాం. 'అన్నదాత సుఖీభవ' రెండో విడత కింద రూ.6310 కోట్లు అందించాం. 'దీపం-2' పథకం ద్వారా రూ.2104 కోట్లతో 2.5 కోట్ల ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశాం” అని తెలిపారు. మహిళల కోసం 'స్త్రీ శక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, 16,397 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నిర్వహించడం వంటివి తమ ప్రభుత్వ విజయాలని పేర్కొన్నారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతులకు డబ్బులు చెల్లిస్తున్నామని, తుఫాన్ నష్టానికి హెక్టార్‌కు రూ.25 వేలు అందిస్తున్నామని అన్నారు. “ఇవన్నీ ప్యాలెస్‌లలో కూర్చుంటే కనిపించవు జగన్ రెడ్డీ. మద్యం ద్వారా రూ.3,500 కోట్లు అవినీతికి పాల్పడిన మీరు మద్యం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ఈ ప్రెస్ మీట్ పెట్టారు. మీరు ఎన్ని కుట్రలు పన్నినా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## రాష్ట్రాభివృద్ధికి కూటమి నాయకుల ఐక్యతే మూలం: పవన్

తెలుసు. అందుకే ఎలాంటి పైరవీలకు తావు లేకుండా, కేవలం అర్హత ఆధారంగానే ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చాం” అని ఆయన స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీలకు విభిన్న భావజాలాలు ఉన్నప్పటికీ... రాష్ట్రం బాగుండాలి- అరాచకాలు ఉండకూడదు అనే ఉమ్మడి లక్ష్యంతో అందరం ఒక గొడుగు కిందకు చేరామని పవన్ అన్నారు. “మన మధ్య చిన్న చిన్న మనస్పర్థలు, కమ్యూనికేషన్ గ్యాప్‌లు సహజం. కూర్చుని మాట్లాడుకుంటే అన్నీ పరిష్కారమవుతాయి. చిన్నగా మొదలైన మన కూటమి, ఈరోజు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో బలమైన శక్తిగా నిలిచింది. మన ఐక్యత వల్లే నామినేటెడ్ పదవులు ఇవ్వగలుగుతున్నాం. ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు శ్రమిస్తే రాష్ట్రానికి సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుంది” అని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనను ప్రస్తావిస్తూ, “శేషాచలం అడవులను అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటివరకు దొరికింది కేవలం 10 శాతం సంపదే. దాని విలువే వేల కోట్లు ఉంటే, ఇక దొరకని సంపద విలువ ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇలాంటి అవినీతిని అరికట్టి, బలహీనుల గొంతుకగా మనం నిలవాలి” అని పిలుపునిచ్చారు. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునే ఒక నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వబోమని గత పాలకులు బెదిరించారని, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలను భయపెట్టి ఏకగ్రీవాలు చేయాలని చూశారని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లోనూ జనసేన కార్యకర్తలు ప్రాణాలకు తెగించి నిలబడ్డారని అభినందించారు. “సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని నింపడమే జనసేన లక్ష్యం. కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకుని గౌరవిస్తాం. గ్రామ స్థాయి నుంచి లోక్‌సభ నియోజకవర్గం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తాం” అని హామీ ఇచ్చారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'స్వచ్ఛరథాల'ను పరిశీలించారు. తిరుచానూరు, కరకంబాడి పంచాయతీల నుంచి తెప్పించిన ఈ వాహనాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అరణి శ్రీనివాసులు, కె. మురళీమోహన్, అరవ శ్రీధర్, ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిపై గెస్ట్ లెక్చరర్ దాడి



**చింతపల్లి , పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా వీపు చేతులు కర్ర దెబ్బలు కొట్టిన గెస్ట్ లెక్చరర్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని, విద్యార్థి కి మెరుగైన వైద్యం అందించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి డిమాండ్ చేశారు. చింతపల్లి ప్రాంతీయ హాస్పటల్లో చికిత్స పొందుతున్న బండి జయంతి ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సాగిన చిరంజీవి మాట్లాడుతూ చింతపల్లి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిపై గెస్ట్ లెక్చరర్ చేసిన దాడి తెలిసినదే. హెూంవర్క్ చూపించలేదని కారణంతో అధ్యాపకుడు విచక్షణ రహి తంగా దెబ్బలు కొట్టారని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనలో కళాశాల పరిసరాలలో ఉద్రిక్తత నెలకొంది. బండి జయంతి బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్నాడు బుధవారం జరిగిన జువాలజీ తరగతిలో గెస్ట్ లెక్చరర్ హరినాథ్ ఆజాద్ విద్యార్థుల హెూంవర్క్ పరీక్షిస్తున్నారు. బండి జయంతి పుస్తకం తీయడం ఆలస్యం కావడంతో. ఆగ్రహించిన అధ్యాపకుడు క్లాసు రూమ్ లో చేతులపై, వీపుపై కర్రతో బలమైన దెబ్బలు కొట్టాడు. అంతటితో ఆగక బయటకు తీసుకుని వెళ్లి బూటు కాలుతో పొట్ట పైన తన్నాడు. చేతుల పైన వీపు పైన కొట్టాడు అని విద్యార్థి తెలిపాడు. దాడి తీవ్రతకు విద్యార్థి తీవ్ర నొప్పితో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో అడ్మిట్ చేసి డాక్టర్లతో వైద్యం అందిస్తున్నారు. చింతపల్లి పోలీస్ స్టేషన్లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసి జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్ పై చట్టపరమైన చర్య తీసుకొని కేసు నమోదు చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారన్నారు . ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించి జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్ ను సస్పెండ్ చేయాలన్నారు . జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని ఇటువంటి సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు బండి రవికుమార్, తులసి, కొర్ర రాజబాబు తదితరులు పాల్గొన్నారు

# 6న విశాఖలో క్రికెట్ సందడి

## హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన టికెట్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 6న దక్షిణాఫ్రికాతో జరగనున్న అంతర్జాతీయ వన్డే మ్యాచ్ కోసం క్రీడాభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విరాట్ కొహ్లి, రోహిత్‌శర్మ బ్యాటింగ్‌ను ఎప్పుడు వీక్షిస్తామా అనే ఉత్సుకతతో ఉన్నారు. రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీతో కొహ్లి, అర్ధ సెంచరీతో రోహిత్‌శర్మ వీరవిహారం చేయడంతో ఇక్కడ జరగనున్న మ్యాచ్‌కు మరింత క్రేజ్ వచ్చింది. అందుకే ఇప్పటివరకూ విశాఖలో జరిగిన పది వన్డే మ్యాచ్‌లతో పోల్చితే ఈసారి టికెట్ ధరలు భారీగా పెంచినా క్రీడాభిమానులు వెనకాడకపోవడం గమనించదగ్గ విషయం. ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సామర్థ్యం సుమారు 27 వేలు కాగా, నిర్వాహకులు 22 వేల టికెట్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచారు. గంటల వ్యవధిలోనే టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అయిపోయాయి. గతంలో ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ల విక్రయాలు జరిగేవి. ఆన్‌లైన్‌లో టికెట్ తీసుకోవడం రానివారు, దొరకనివారు...ఆఫ్‌లైన్‌లో ఏర్పాటుచేసే విక్రయ కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుంచి కాపుకాసి టికెట్ పొందిన సందర్భాలు ఉన్నాయి. అయితే ప్రస్తుత ఏసీఏ కార్యవర్గం అటువంటి చర్యలు చేపట్టకపోవడంపై క్రీడాభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మ్యాచ్‌కు డిజిటల్ టికెటింగ్‌ను ప్రవేశపెడుతున్నారు. ప్రవేశ ద్వారాల వద్ద టికెట్ స్కాన్ చేసి లోపలకు ప్రవేశించాల్సిందే. ఒకరు లోపలకు వెళ్లి, దొడ్డిదారిలో ఆ టికెట్‌ను బయట ఉన్న మరొకరికి అందించినా ఫలితం ఉండదు. ఒకసారి స్కాన్ అయిన టికెట్‌కు రెండోసారి అవకాశం ఉండదు. అంత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మ్యాచ్‌కు సీటు నంబరింగ్ విధానం అమలు చేయడం లేదని తెలుస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ మాదిరిగా ముందు వచ్చినవారు తమకు ఇష్టమైన సీట్లలో కూర్చోవచ్చు. అయితే ఈ విధానంతో సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ముందుగా వచ్చి ముందు సీటులో కూర్చొన్న వ్యక్తి వాష్‌రూమ్ లేదా వేరే అవసరాలతో అక్కడ నుంచి వెళితే...మరొకరు కూర్చొనే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదాలు ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని కొందరు ఏసీఏ ప్రతినిధులు వద్ద ప్రస్తావించగా అటువంటిదేమీ ఉండదని తేలికగా తీసుకున్నారని సమాచారం.

# జీసీసీ ఉద్యోగాల్లో అవినీతి ఆరోపణలు అవాస్తవం: డైలీ వేజ్ సేల్స్‌మెన్‌లు



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా, చింతపల్లిలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) రేషన్ డిపోలో డైలీ వేజ్ సేల్స్‌మెన్‌ల నియామకాలపై వస్తున్న అవినీతి ఆరోపణలను కొత్తగా నియమితులైన సిబ్బంది తీవ్రంగా ఖండించారు. లక్షలాది రూపాయలు లంచాలు తీసుకుని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు నిరాధారమైనవని వారు స్పష్టం చేశారు.కొత్తగా నియమితులైన డైలీ వేజ్ సేల్స్‌మెన్‌లు, రెగ్యులర్, కాంట్రాక్టు సిబ్బంది మంగళవారం మీడియా ముందుకొచ్చి తమ వాస్తవాలను వెల్లడించారు. కొత్తగా నియమితులైన ప్రియాంక, శ్రీనివాస్, జె. అనిల్ కుమార్, ఎస్. రమణమ్మ సహా ఇతరులు మాట్లాడుతూ, తాము ఉద్యోగాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వలేదని తేల్చి చెప్పారు."లక్షలాది రూపాయలు లంచం ఇచ్చే స్తోమత ఉంటే, నెలకు కేవలం ?5,000 వచ్చే డైలీ వేజ్ ఉద్యోగాల్లో ఎందుకు చేరుతామని" వారు ప్రశ్నించారు. ఈ ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. కొందరు సిబ్బంది తమ వ్యక్తిగత, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా, అలాగే నిరుద్యోగులుగా ఉండి ఉపాధి కోసం ఉన్నతాధికారులను అభ్యర్థించగా, సంస్థ నిబంధనలకు లోబడి వారికి ఈ తాత్కాలిక (డైలీ వేజ్) ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ఎస్. రమణమ్మ (సేల్స్‌మెన్) మాట్లాడుతూ, తాను 10 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నానని, తన సొంత మండలం కొయ్యూరుకు బదిలీ చేయమని అభ్యర్థించగా, ఆఫీస్ సిబ్బంది సలహా మేరకు బదిలీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ బదిలీకి ఎలాంటి డబ్బులు చెల్లించలేదని ధృవీకరించారు. ఏబలం విలేజ్‌కు చెందిన ప్రియాంక మాట్లాడుతూ, చదువుకున్నా ఖాళీగా ఉన్నందున ఉపాధి కల్పించమని అధికారులను విన్నవించుకోగా, డోక్రా తరఫున అవకాశం కల్పించారని, ఇందుకోసం ఒక రూపాయి కూడా కట్టలేదని తెలిపారు. శ్రీనివాస్ తన తల్లి రిటైర్ అయిన తర్వాత, ఆమె చేస్తున్న పనిని కొనసాగించేందుకు సంస్థ డైలీ వేజ్ లేబర్‌గా అవకాశం కల్పించిందని, ఎటువంటి డబ్బులు కట్టలేదని స్పష్టం చేశారు. 2007లో కాంట్రాక్టు సేల్స్‌మెన్‌గా పనిచేసిన లమ్మసింగి రాజు మాట్లాడుతూ, ఆరోగ్యం బాగోలేనందున కొంతకాలం విధులకు దూరమయ్యానని, తరువాత కొంత డెఫిసిటీ మొత్తాన్ని చెల్లించి, తన బాధను అధికారులకు వివరించగా, తిరిగి విధుల్లోకి చేర్చుకున్నారని చెప్పారు.

# పింఛన్లు ఆపివేతపై ఎంపీడీఓ కార్యాలయం ముందు వైసీపీ ఆందోళన



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలో సుమారు 11 మంది వృద్ధవికలాంగుల మరియు వితంతువుల పింఛన్లు ఆపివేయడాన్ని నిరసిస్తూ గొలుగొండ మండల ఎంపీడీఓ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు మాట్లాడుతూ ప్రతి నెలా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ల కోసం ఇలా ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం అత్యంత బాధాకరం. అమ్మపేట, వెంకటరాంపురం గ్రామాలకు చెందిన 11 మంది పింఛన్లు ఎందుకు ఆపారో స్పష్టమైన కారణాలు చెప్పకుండా అధికారులు నెలల తరబడి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పింఛన్లు పునరుద్ధరించాలని,లేని పక్షంలో మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి,పింఛన్ దారులు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతకు యోగా



**అరకులోయ, పతాకం న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీ జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2 ఆధ్వర్యంలో దత్తత గ్రామాలైన రవ్వలగూడ, ఆర్ డుంబ్రిగూడలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో యోగా - ధ్యాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృంగవరపుకోటకు చెందిన సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బొబ్బిలి రామకృష్ణ హాజరయ్యారు. ఆయన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు యోగా, ప్రాణాయామం, ధ్యానం పై అవగాహన కల్పించి, వివిధ ఆసనాలు, ప్రాణాయామ వ్యాయామాలు, ధ్యాన సాధన చేయించారు. ఈ సందర్భంగా డా. బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, స్థిరత్వం సాధించవచ్చు. నేటి ఒత్తిడి జీవితంలో యోగా అనివార్య అవసరం అని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. కొండబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి. నాగబాబు, వై. విజయలక్ష్మి, వాలంటీర్లు కలిసి ముఖ్య అతిథి డా. బొబ్బిలి రామకృష్ణను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. అదే శిబిరంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా శుభ్రం చేశారు.

# పీఎంఆర్సి గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా శాంతిమతి బాధ్యతలు స్వీకరణ



**అడ్డతీగెల, పతాకం న్యూస్:** బాలికల విద్యా అభివృద్ధికి కట్టుబడి విధులు నిర్వర్తిస్తూ ప్రశంసలందుకున్న అడ్డతీగల బాలికల ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్‌మిస్ట్రెస్ డి. శాంతిమతికి కొత్త పదవిలో కీలక బాధ్యతలు అప్పగించబడ్డాయి. పీఎంఆర్‌సీ పునర్‌నిర్మాణ ప్రణాళికలో భాగంగా విడుదల చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఆమెను గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ గా ఎంపిక చేయడం అధికారికంగా ఖరారైంది. ఇంతకుముందు అడ్డతీగల బాయ్స్, సోములగూడెం, సింగంపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో హెడ్మాస్టర్ గా గతకొన్నేళ్లపాటు సేవలందించిన శాంతిమతి, విద్యార్థుల అభివృద్ధి, బాలికల శిక్షణ, తల్లిదండ్రుల సహకారాన్ని పెంచడంలో ప్రత్యేక గుర్తింపు సాధించారు. 2022 జూన్ నుండి అడ్డతీగల బాలికల ఉన్నత పాఠశాలలో హెడ్‌మిస్ట్రెస్‌గా బాధ్యతలు చేపట్టి, విద్యార్థుల హాజరు పెంపు, విద్యా ప్రమాణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలలో ప్రోత్సాహం వంటి అంశాల్లో ప్రగతిని సాధించి తల్లిదండ్రులతో పాటు సిబ్బందిలోనూ మన్ననలు పొందారు. పీఎంఆర్‌సీ పునర్‌నిర్మాణ చర్యలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో బాలికల విద్య, భద్రత, కెరీర్ అభివృద్ధి కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం కొత్త బాధ్యతల ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం




**రంపచోడవరం, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజవర్గం గంగవరం మండలం గంగవరం మండల పరిధిలో ఆర్ యస్ కె పరిధిలో వర్క్ షాప్ సమావేశాలు మండల వ్యవసాయ అధికారి కె.విశ్వనాధ్ ఆధ్వర్యంలో జరిగింది. మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో 6 రోజుల పాటు రైతన్నా మీకోసం వారోత్సవాలు పూర్తి చేసుకొని, చివరిగా వర్క్ షాప్ లు నిర్వహించారు.ఆయా గ్రామ సర్పంచ్ ల ఆధ్వర్యంలో జరిగిన వ్యవసాయ గ్రామ సభల్లో 5 సూత్రాలైన-నీటి భద్రత.డిమాండ్ ఆధారిత పంటలు.అగ్రిటెక్.ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రభుత్వం నుండీ మద్దతు. రాబోయే 3 పంట సీజనుల కొరకు యాక్షన్ ప్లాన్ తయారు చేయుట జరిగిందని వ్యవసాయ అధికారి విశ్వనాధ్ తెలిపారు.మండలం లోని ఆర్ యస్ కె లలో పాల్గొని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి,సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపాలన్నారు. జడ్పీటీసీ బేబీరత్నం మాట్లాడుతూ.వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగు ఖర్చులు తగ్గించుకొంటూ నాణ్యమైన,అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సొసైటీ చైర్మన్ పాము అర్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు,ప్రజా ప్రతినిధులకు, మండల రైతంగానికి ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రరైతు అధికార ప్రతినిధి కనిగిరి రాంబాబు మాట్లాడుతూ -భూపతిపాలెం రిజర్వాయరు కాలువను కొనసాగిస్తే ఏజెన్సీ రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎక్స్ ఎంపీపీ తీగల ప్రభ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పధకాలపై అవగాహనా కలిగిఉండాలన్నారు.ఎంపీడీఓ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ముదురు జీడిమామిడి తోటలు తీసివేసి,వాటి స్థానం లో కొత్త మొక్కలు ఎన్ ఆర్ జి సి ద్వారా నాటి,ఆర్థికంగా రైతులు పరిపుష్టి కాగలరని తెలిపారు.సర్పంచ్ లు,ఎంపీటీసీ సభ్యులు,టీడీపీ మండల అధ్యక్షులు పల్లాల వెంకట రెడ్డి,ఎక్స్ జడ్పీటీసీ,కూటమి నాయకులు-వెంకన్నదొర, ఏపీసీన్ప ప్రతినిధి-గంగరాజు అగ్రికల్చర్,హార్టికల్చర్, వెటర్నరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కవల ఆదివాసీ శిశువులకు రెండేళ్ల పాటు ఉచితంగా పాల డబ్బాలు..యూనిటీ ఫర్ చారిటీ ట్రస్ట్ దాతృత్వం




**డుంబ్రిగూడ, పతాకం న్యూస్:** ఆదివాసీ గిరిజన పిల్లల ఆరోగ్యం కోసం మరో మంచి పని జరిగింది. అరకువేలి మండలం చొంపి పంచాయతీ గేమ్మెలివలసకు చెందిన కొర్ర డాలిమ్మ దంపతులకు నాలుగు నెలల క్రితం కవల పిల్లలు జన్మించారు.తల్లి పాలు సరిపోకపోవడంతో పాల డబ్బాల కోసం నెల నెలా కష్టాలు పడుతున్న ఈ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు ముందుకు వచ్చింది.రెండేళ్ల పాటు ఈ కవల పిల్లలకు పూర్తిగా ఉచితంగా పాల డబ్బాలు నెల నెలా సరఫరా చేయనున్నట్లు ట్రస్టు ప్రకటించింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు సభ్యులు నీలి జోస్పిన్, నీలి నారాయణరావు, డుంబ్రిగూడ మండల కార్యదర్శి టి. సూర్యనారాయణ చేతుల మీదుగా తొలి నెల పాల డబ్బాలు అందజేశారు.ఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో తల్లి లేని పసిపిల్లలు, తల్లీపాలు సరిపోని చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. వీరి కోసం యూనిటీ ఫర్ చారిటీ ట్రస్టు అనేక సంవత్సరాలుగా కృషి చేస్తోంది. ఇప్పటి వరకు అరకు, డుంబ్రిగూడ,అనంతగిరి, పెదబయలు మండలాల్లో 32 మంది ఆదివాసీ పిల్లలకు నెలవారీ ఉచిత పాల డబ్బాలు అందిస్తున్నాం.ఈ కార్యక్రమం మరింత విస్తరిస్తుంది అని తెలిపారు.ట్రస్టు సభ్యులకు, సహకారంతో ముందుకు వచ్చిన వారందరికీ గిరిజన సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపిన కిల్లో సురేంద్ర ఇలాంటి సేవా కార్యక్రమాలకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం



**గొలుగొండ, పతాకం న్యూస్:** విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు గ్రామస్థ లకు జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో విజిలెన్స్ మరియు ఏపీటీఎస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.హేమవతి,రోలుగుంట సెక్షన్ ఇంచార్జి అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.బంగారయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యుత్ తీగలకు దగ్గరగా గాలిపటాలు ఎగరవేయడం,తడి బట్టలు కరెంటు వైర్లపై ఎండబెట్టడం,అనుమతి లేకుండా వైర్లపై హుక్కులు వేసుకోవడం,విద్యుత్ స్తంభాలపై ఎక్కడం వంటి పనులు ఎంతో ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు.విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా అజాగ్రత్త వల్లే జరుగుతున్నాయి.ఒక్క క్షణం అశ్రద్ధ చేసినా ప్రాణాలు కోల్పోవచ్చుని,ముఖ్యంగా పిల్లలు,యువకులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని విజిలెన్స్ ఎస్ఐ ఎస్.హేమవతి మాట్లాడుతూ సూచించారు.అలాగే విద్యుత్ లైన్ల సమీపంలో చెట్ల కొమ్మలు ఉంటే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని,ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ఏఈ ఎస్.బంగారయ్య కోరారు.ఈ అవగాహన కార్యక్రమం గ్రామస్థులకు చాలా ఉపయోగకరంగా ఉందని,ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని పాల్గొన్నవారు కోరారు.నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు,రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## విజయవాడ భవానీపురంలో హైటెన్షన్.. కూల్చివేతలపై సుప్రీంకోర్టు స్టే



**విజయవాడ, పతాకం న్యూస్:** న్యాయస్థానం ఆదేశాల మేరకు లక్ష్మీ రామా కోపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు 42 ప్లాట్లను ఖాళీ చేయించేందుకు భారీ పోలీసు బందోబస్తు నడుమ పొక్లెయిన్లతో తరలివచ్చి 16 ఇళ్లను కూల్చివేశారు. మిగతా ప్లాట్ల యజమానులు, వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రతిఘటించారు. అయితే, సాయంత్రానికి సుప్రీంకోర్టు నుంచి ఊరట లభించడంతో బాధితులు తాత్కాలికంగా ఊపిరి పీల్చుకున్నారు. తమ ఇళ్లను కూల్చివేయడాన్ని నిరసిస్తూ బాధితులు సితార సెంటర్ సమీపంలోని బైపాస్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు వెంటనే అడ్డుకున్నారు. నిరసన కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో ఏసీపీ దుర్గారావు, భవానీపురం సీఐ ఉమామహేశ్వరరావు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చిందని న్యాయవాదులు చెప్పినా కూల్చివేతలు కొనసాగించారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని బాధితులు పేర్కొంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. సుమారు 20 ఏళ్ల క్రితం స్థల యజమాని, లక్ష్మీరామా కోపరేటివ్ సొసైటీకి మధ్య అగ్రిమెంట్ జరిగింది. అయితే సొసైటీ సభ్యులు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో యజమాని ఆ స్థలాన్ని 42 మందికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై సొసైటీ పదేళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించగా, ఇటీవల వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ తీర్పు ఆధారంగానే సొసైటీ సభ్యులు నిన్న కూల్చివేతలు చేపట్టారు. ఈ పరిణామాల మధ్య, బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం, ఇళ్ల తొలగింపు ప్రక్రియను ఈ నెల 31 వరకు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు సాయంత్రానికి వచ్చాయి. దీంతో ఒకే రోజు నాటకీయ పరిణామాల మధ్య బాధితులకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది.

## గురుకుల విద్యార్థుల కుటుంబాలకు 'సాంత్వన' భరోసా.. రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా



**అమరావతి, పతాకం న్యూస్:** డా.బి.ఆర్. అంబేద్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతూ అనారోగ్యంతో దురదృష్టవశాత్తు మరణించిన విద్యార్థుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'సాంత్వన' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మృతుల కుటుంబానికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ పేద విద్యార్థుల కోసం ఇలాంటి పథకం లేదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యాలయంలో నిన్న జరిగిన కార్యక్రమంలో, ఇటీవల అనారోగ్యంతో మరణించిన ముగ్గురు విద్యార్థినుల కుటుంబాలకు మంత్రి డోలా స్వామి సాంత్వన చెక్కులను అందజేశారు. పల్నాడు జిల్లా ఆర్కేపురం గురుకులం విద్యార్థిని టి.నిహారిక, ప్రకాశం జిల్లా రాచర్ల గురుకులం విద్యార్థిని కొఠారి కర్ణ, బాపట్ల గురుకులం విద్యార్థిని బి. శ్వేత కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ. 3 లక్షల చొప్పున మొత్తం రూ. 9 లక్షల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలతో రూ.5కోట్ల నిధులు కేటాయించి ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. "పేద విద్యార్థుల ఆరోగ్యం, వారి కుటుంబాల సంక్షేమం పట్ల సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వెంటనే వైద్యం అందించి ఇప్పటివరకు 30 మందికి పైగా విద్యార్థుల ప్రాణాలు కాపాడాం" అని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ అదనపు కార్యదర్శి సునీల్ రాజ్ కుమార్, డా. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలో కార్యకర్తలందరికీ సముచిత స్థానం కల్పిస్తాం: బిడిజాన అప్పారావు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని కొయ్యూరు మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు బిడిజాన అప్పారావు ధీమా వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు శాసనసభ్యులు మరియు అల్లూరి జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు మత్సరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు రానున్న రోజుల్లో తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తామని,వైఎస్ఆర్సీపీ ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, లక్షలాది కార్యకర్తల కుటుంబమని,పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడే కార్యకర్తలే తమ నిజమైన బలం అని పేర్కొన్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఏవొక్క కార్యకర్తల్లో ఎలాంటి నిరుత్సాహం లేదని,ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పార్టీ కోసం పనిచేస్తున్నారని,గడిచిన ఐదేళ్లలో వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే,పార్టీ మరోకసారి ఘన విజయం సాధించడం ఖాయం అని విశ్వాసం వ్యక్తం చేశారు.అలాగే ఈ ఎన్నికల్లో కొయ్యూరు మండలం నుండి కూడా వైఎస్ఆర్సీపీ అభ్యర్థి భారీ మెజారిటీతో గెలుస్తాడని, అధికారం మరోసారి వైఎస్ఆర్సీపీదేనని బిడిజాన అప్పారావు ధీమా వ్యక్తం చేశారు.

## సొంతంగా రోడ్డు నిర్మించుకుంటున్న ఆదివాసి పేద గిరిజనులు



**చింతపల్లి , పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా చింతపల్లి మండలం బుడతల వేనం గ్రామ ప్రజల ఇబ్బందులు ప్రభుత్వాలు, అధికారులు మారుతున్న మారని గిరిజన బ్రతుకులు. గ్రామ అభివృద్ధి పేరిట వేల కోట్ల లక్షల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐటిడిఏ లకు మంజూరు చేస్తున్నప్పటికీ గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు సదుపాయం లేనందువల్ల ఆదివాసి గిరిజన ప్రజలే ప్రతి ఇంటికి చందాలు వసూలు చేసి యంత్రాలు, వాహనాల సహాయంతో సొంతంగా రోడ్లు నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వ పాలకులు సిగ్గుతో తల దించుకోవలసిన తరుణమిది. ఐదు సంవత్సరాలకు ఒకసారి మీ గ్రామ అభివృద్ధి కోసం నేను కృషిచేస్తాను నన్నునాయకుడిగా నియమించుకొని గెలిపించుకోండి అని మాయ మాటలు చెప్పి గద్దెను ఎక్కిన తరువాత ఆ ప్రజలను మరిచిపోయే నాయకులు, మరోవైపు అభివృద్ధి పేరుతో వేలకోట్ల రూపాయలు మాయం చేస్తున్న అధికారులు మరోవైపు అనిబుడతల వేనం గ్రామ ప్రజలు వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుడతల వేనం గ్రామం 60 సంవత్సరాలు దాటినా సరైన రోడ్డు సదుపాయం లేక ప్రభుత్వ ప్రాథమిక హాస్పటల్ కి వెళ్ళాలి అంటే డోలి మోతలతో వెళుతూ మధ్యలోనే ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి ముడతల వేనం గ్రామానికి నూతన రోడ్డు మంజూరు చేసి గ్రామ ప్రజల్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామస్తులు, చంటి బాబు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలి: జేసీ



**గంట్యాడ, పతాకం న్యూస్:** రైతులు అధిక దిగుబడి కోసం పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని జేసీ సేతుమాధవన్ కోరారు. మండలంలోని కొర్లాంలో నిర్వహించిన మీకోసం వర్క్‌షాపు నిర్వహించారు. తొలుత గ్రామానికి చెందిన రైతులు పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలోని రీసర్వే జరగడంతో పలు సమస్యలు ఉన్నాయని, గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం సేకరించిన భూమికి సంబందించిన ప్రభుత్వం ఇస్తామన్నా 30 శాతం పరిహారం ఇవ్వలేదని, నీటి వసతులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వివరించారు. అనంతరం జేసీ సేతుమాధవన్ మాట్లాడుతూ వరికి బదులు పంటమార్పిడి చేయడంతోపాటు ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వెంకట రమణ రైస్ మిల్లును తనిఖీచేశారు. అక్కడ నుంచి కొండతామారాపల్లిలో ఆదర్శ రైతు సాగు చేస్తున్న టమాట పంటను పరిశీలించారు. కార్యక్రమంలోని ఉద్యాన శాఖ డీడీ చిట్టిబాబు, తహసీల్దార్ నీలకంఠశ్వరరెడ్డి, ఏవో శ్యామ్ కుమార్, సీఎస్‌డీటీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

## 2,500 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ: మంత్రి నారాయణ



**పల్నాడు, పతాకం న్యూస్:** పల్నాడు జిల్లా అమరావతి మండలం యండ్రాయిలో రెండో విడత భూసమీకరణలో తీసుకుంటున్న 7 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. రెండో భూసమీకరణ చేపడుతున్న ప్రాంత రైతులతో పల్నాడు జిల్లా యండ్రాయిలో మంత్రి నారాయణ సమావేశం అయ్యారు. యండ్రాయి, వైకుంఠపురం, పెద్దమత్తూరు, కర్లపూడి రైతులతో పాటు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమావేశంలో పాల్గొన్నారు. భూసమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. భూసమీకరణపై రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఏడాదిలోపు స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో రాజధాని నిర్మాణం ఆలస్యమైందని అన్నారు. ఆ బిల్లులు చెల్లించి మళ్లీ రాజధాని పనులు మొదలుపెట్టే సమయానికి వర్షాలు ముంచెత్తాయి. రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారని పేర్కొన్నారు. రెండో విడత భూసమీకరణలో రైతులు ఇచ్చే 7 వేలకు పైగా ఎకరాల భూముల్లోని 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గతంలో భూసమీకరణ సమయంలో రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని నారాయణ తెలిపారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వివరించారు. అదే విధంగా నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని మంత్రి నారాయణ తెలిపారు.'వైఎస్సార్సీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక రాజధాని నిర్మాణం ఆలస్యమైంది. గుత్తేదారులకు బకాయిలు చెల్లించి పనులు ప్రారంభించేనాటికి వర్షాలు ముంచెత్తాయి. అంతర్జాతీయ రాజధాని నిర్మాణంలో భాగంగా స్మార్ట్ ఇండస్ట్రీలు, అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సీఎం నిర్ణయించారు. పల్నాడు జిల్లాలో రైతులు ఇచ్చిన భూమిలో 2,500 ఎకరాల్లో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తాం. గతంలో భూ సమీకరణ సమయంలో విధానాలే ఇక్కడా అమలు చేస్తాం. ట్రంకురోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. నాలుగు, ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ కూడా ఏడాదిలోనే స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలు: కలెక్టర్



**విజయనగరం, పతాకం న్యూస్:** అర్హులందరికీ ఇళ్ల స్థలాలు వచ్చే విధంగా కృషి చేయాలని, దీని కోసం వారి పేర్లు నమోదుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులు ఆదేశిం చారు.ఇళ్ల స్థలాలకోసం పేర్లు నమోదు చేసుకోవడానికి ఈనెల 14 వరకూ ప్రభుత్వం గడువు ఇచ్చిందని,ఈవిషయాన్ని ప్రజలకు తెలియజేసి నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విజయనగ రం నుంచి ఆయా శాఖ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇళ్లస్థలాలు మంజూరుకు గ్రామాల వారీగా ప్రణాళిక రూపొందించాలన్నా రు. ఆయాగ్రామాల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న స్థలాలు, ఇంకా ఎంత కావాలి, తదితర వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ముటేషన్లు, ఇతర రెవెన్యూ సంబందిత దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్క రించాలని కోరారు. రైస్ కార్డులు పెండింగ్ దరఖాస్తులను క్లియర్ చేయా లని జేసీ సేతు మాధవన్‌ను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, గోనె సంచులు, జీపీఎస్‌తో కూడిన వాహ నాలు సిద్దంగా ఉన్నాయని చెప్పారు. రెండు రోజుల్లో బ్యాంకు గ్యారెంటీలు కూడా పూర్తవుతాయని తెలిపారు.బీజీలు రానిచోట్ల మిల్లర్లతో మాట్లాడాలని సూచించారు. సమావేశంలో12 రెవెన్యూ, అనుబంధ శాఖల అంశాలపై చర్చించా రు.హౌసింగ్ ఫర్‌ఆల్,ఖాళీస్థలాలు రెగ్యు లరైజేషన్ స్కీమ్‌తోపాటు, భూ బదిలీ, 22ఏ ఫైళ్లు, వెబ్‌ల్యాండ్, ముటేషన్ల పురోగతి తదితరఅంశాలపై చర్చించారు. సమావే శంలో ఇన్‌చార్జి డీఆర్వో మురళి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ అవినీతిపై పార్లమెంటులో చర్చించాలి

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు డిమాండ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ఉక్కు శాఖ మంత్రి స్పందించాలని, ఈ అవినీతి వ్యవహారంపై ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో చర్చించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సిగరావు డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ జంక్షన్ లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ కు నాసిరకం ముడి సరుకు సరఫరా చేశారని, ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వ్యవహారంలో స్టీల్ ప్లాంట్ సిఎండి గా వ్యవహరిస్తున్న అధికారి పాత్ర ఉందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ కు నాసిరకం బొగ్గు సరఫరా చేశారని, ఇందువల్ల కర్మాగారానికి నష్టాలు వస్తున్నాయన్నారు. ఇది మాత్రమే కాకుండా దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్ కర్మాగారాలకు సొంత గనులు ఉన్నాయన్నారు. అటువంటప్పుడు ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.ఈ ఏడాది జూన్ వరకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు వచ్చాయన్నారు. ఆ తర్వాత నష్టాలు రావడానికి కారణం సిఎండి వ్యవహార శైలి అని విమర్శించారు. కేంద్ర స్టీల్ శాఖ మంత్రి విశాఖ స్టీల్ ప్లాంట్ ను సందర్శించాలని, నిజానిజాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్ ఉత్పత్తికి కార్మికుల జీతాలకు లింకు పెడుతూ ఇచ్చిన సర్క్యులర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ లో అవినీతి తారాస్థాయికి చేరిందన్నారు. స్టీల్ ప్లాంట్ ను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే వైఖరిని కొనసాగిస్తే స్టీల్ ప్లాంట్ ను రక్షించుకోవడానికి రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం, సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం. జగ్గు నాయుడు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, ఉపాధ్యక్షులు పి.మణి,కె.ఎం కుమార మంగళం, ఎం.సుబ్బారావు,కోశాధికారి ఎస్. జ్యోతీశ్వరరావు, కార్యదర్శులు పి. వెంకటరావు,ఆర్.లక్ష్మణ్ మూర్తి, పి.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత

## రాజపత్రం విడుదల చేయనున్న కేంద్రం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ మొదలైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలోని 5(2)కి సవరణ చేసేందుకు కొద్దిరోజుల కిందటే కేంద్రం చర్యలు ప్రారంభించింది. దీనికి ఇప్పటికే న్యాయశాఖ ఆమోదముద్ర లభించింది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత, త్వరలో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ ఆమోదం తర్వాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజపత్రం (గెజిట్) విడుదల చేస్తారు. విభజన తర్వాత ఏపీ రాజధానిగా అమరావతిని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎంపిక చేసింది. రాజధాని అమరావతి నిర్మాణానికి 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే అక్కడ అసెంబ్లీ, సచివాలయ భవనాలు నిర్మించి పాలన ప్రారంభించారు. పెద్దఎత్తున రహదారులు, భవనాల నిర్మాణం మొదలైంది. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. 2024లో కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి మళ్లీ వెలుగులొచ్చాయి. రాజధాని నిర్మాణం కోసం రూ.58వేల కోట్లతో పనులు ప్రారంభించారు. అమరావతికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా విభజన చట్టంలో సవరణ చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు.

పార్ట్-2 కింద 5(1) : నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది.

పార్ట్-2 కింద 5(2) : సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజన చట్టంలో సవరణ చేస్తారు.

పార్ట్ 2-5(2) సబ్‌సెక్షన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది అనేచోట అమరావతి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌కి నూతన రాజధాని ఏర్పాటైందని పేర్కొంటారు.

ఇప్పటికే రాజధాని అమరావతి పనులు అత్యంత వేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. దేశ విదేశాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ తమ సంస్థల నిర్వహణకు ఎంఓయూలు చేసుకున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్? సహా ఎన్నో కంపెనీలు నెలకొననున్నాయి. ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతి నగర విస్తరణలో భాగంగా రెండోవిడత భూసమీకరణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. తుళ్లూరు మండలంలో 3 గ్రామాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలో 4 గ్రామాల పరిధిలో రైతుల నుంచి భూమి సమీకరించనున్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి మెజారిటీ రైతుల అభిప్రాయాలు సేకరించగా అత్యధికులు సానుకూలంగా స్పందించారు. తొలివిడత భూసమీకరణలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు రెండో విడతలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# పెంచలయ్య కుటుంబానికి రూ.10 లక్షల సాయం అందజేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



**నెల్లూరు, పతాకం న్యూస్:** గంజాయి ముఠా చేతిలో ప్రాణాలు కోల్పోయిన సీపీఎం నాయకుడు పెంచలయ్య కుటుంబ పోషణకు తన వంతుగా రూ.10 లక్షలు అందచేస్తున్నట్టు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. సీపీఎం నాయకులతో కలిసి ఆయన కల్లూరిపల్లి వద్దనున్న ఆర్డీటీ కాలనీలోని పెంచలయ్య నివాసానికి వెళ్లి ఆయన భార్య దుర్గా, పిల్లలు కుమార్‌దేవ్, నిఖిలికి నగదు అందచేశారు. అనంతరం ఆ కుటుంబంతో ఏకాంతంగా మాట్లాడిన ఎమ్మెల్యే.. పెంచలయ్య ఇద్దరు బిడ్డలు ఎంతవరకు చదువుకోవాలనుకుంటే అంతవరకు తన కుమార్తెలైన హైందవి, వైష్ణవి ఆ బాధ్యతలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు. అలాగే పెంచలయ్య చేసిన గంజాయి వ్యతిరేక ఉద్యమ స్ఫూర్తిని చాటే విధంగా ఆర్డీటీ కాలనీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాలనీ అభివృద్ధికి వారం రోజుల వ్యవధిలో రూ.50 లక్షలు నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామన్నారు.

# సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీకి ఉపశమనం



**నెల్లూరు, పతాకం న్యూస్:** భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.

# పెంచలయ్య హత్యను ఖండిస్తూ నిరసన




**గుంటూరు, పతాకం న్యూస్:** పెంచలయ్య హత్యను ఖండిస్తూ నెల్లూరు జిల్లాలో సిపిఎం నాయకులు, ప్రజా కళాకారులు గురువారం మంగళగిరి పట్టణంలో గల మిద్దె సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంజాయి మాఫియా పైన, పెంచలయ్య హత్య పైన ప్రభుత్వ స్పందన బాగా లేదని అన్నారు. నెల్లూరులో గంజాయి గ్యాంగ్ పెంచలయ్యను హత్య చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనిత స్పందించలేదని అన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పనిచేసిన పెంచలయ్య హత్యకు గురైతే కనీసం మాట్లాడకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గంజాయి మాఫియాకు బలైన పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, పట్టణ నాయకులు ఎం చలపతిరావు, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్, ఎం నాగేశ్వరావు, ఎం బాలాజీ, మహిళా సంఘం నాయకురాలు మీరావలి, వివిధ ప్రజాసంఘాల నాయకులు డి రామారావు, టి హేమ సుందరరావు, ఎస్ కోటేశ్వరరావు, కే వెంకటేశ్వర్లు, కే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఊటుకూరు-కొండ్లోపల్లె మార్గంలో రాకపోకలు బంద్



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** దిత్వా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఊటుకూరు నుంచి కొండ్లోపల్లి కి వెళ్లే రహదారిలో గల ఎగువ నుంచి నీరు ప్రవహిస్తుండడంతో తహసిల్దార్ పీర్ మున్ని ఆదేశానుసారం ఊటుకూరు విఆర్ఓ శివరాజ్ ఎనర్జీ అసిస్టెంట్ అచ్యుత్ సాయి తో కలిసి గురువారం ఊటుకూరు-కొండ్లోపల్లె మార్గాన్ని మూసివేశారు. వరద ఉధృతి పెరుగుతున్న కారణంగా ఈ మార్గం గుండా ఎవరూ ప్రయాణించకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. హెచ్చరికను అతిక్రమించి ఎవరూ అటువైపు వెళ్ళకూడదు అని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# లేబర్ కోడ్లపై ప్రతిపక్షా ఆందోళన




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పార్లమెంట్ ఆవరణలోని మకరద్వారం ఎదుట కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, డిఎంకె, టిఎంసి, ఎన్‌సిపి, ఆర్‌జెడి, ఎస్‌పి, ఐయుఎంఎల్ తదితర ప్రతిపక్ష నేతలు ఆందోళన చేపట్టారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్ వద్దు - కార్మికులకు న్యాయం కావాలి' అంటూ భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని నేతలు ప్లకార్డులు చేబూని పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమని, కార్పొరేట్లకు అనుకూలమని విమర్శించారు. 'కొత్త కోడ్‌లు ఉద్యోగ భద్రతకు ముప్పు. లేఆఫ్ పరిమితిని 100 నుండి 300 మందికి పెంచారు. దేశంలోని 80 శాతం కంటే ఎక్కువ పరిశ్రమలు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను తొలగించవచ్చు. ఉద్యోగ భద్రతను కాలరాస్తున్నారు. స్థిర కాల ఉపాధి (ఎఫ్‌టిఇ) విస్తరణ అనేక శాశ్వత ఉద్యోగాలకు ముగింపు పలికింది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉండవు' అని ఆయన అన్నారు. కోడ్ ఎనిమిది గంటల పని దినాన్ని కాగితంపై ఉంచిన ప్పటికీ, రాష్ట్రాలు 12 గంటల షిఫ్ట్‌లను అనుమతించ వచ్చని చెప్పారు. 'రాష్ట్రాలు నిర్ణయించిన ఓవర్ టైమ్ పరిమితులతో కలిపి, చాలా ఎక్కువ పనిదినాలను అనుమతిస్తుంది. 'ఏకాభిప్రాయం' అని లేబుల్ చేయబడినప్పటికీ అలసట, భద్రతా ప్రమాదాలను పెంచుతుంది' అని అన్నారు. 'కార్మికులు సమ్మె చేయడానికి 60 రోజులపాటు వేచి ఉండాలి. ఇది అన్యాయమైన పరిస్థితులను సృష్టం చేస్తోంది. 51 శాతం సభ్యత్వం కలిగిన ఒక యూనియన్‌ను ఏకైక సంధానకర్తగా ఉంచడం చిన్న యూనియన్లను పక్కన పెడుతుంది. విభిన్న కార్మిక సమూహాలకు ప్రాతినిధ్యం తగ్గిస్తుంది' అని పేర్కొన్నారు. 300 కంటే తక్కువ మంది కార్మికులున్న యూనిట్లకు స్టాండింగ్ ఆర్డర్లు వర్తించవని ఆయన తెలిపారు. ఈ కోడ్‌లు కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తున్నాయని విమర్శించారు.

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్రప్రభుత్వం దాడి చేస్తుందని సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. కార్మిక పోరాటాల చరిత్ర తెలుసుకోకుండా, కార్మిక సంఘాల సమ్మతి తీసుకోకుండా లేబర్ కోడ్లను ఏకపక్షంగా మోడీ సర్కారు తీసుకొచ్చిందన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న, ఉత్పత్తి సృష్టికర్తలైన కార్మిక వర్గంపై కేంద్రప్రభుత్వం దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత కోసమే లేబర్ కోడ్లను తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం, కార్మికుల గొంతు ఎందుకు వినడం లేదని ప్రశ్నించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటాల పట్ల మొద్దునిద్రతో కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. కార్మిక సంఘాలు లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పలేక చర్చకు మొఖం చాటేస్తోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల చేతుల్లో ఉన్న అన్ని హక్కులనూ కేంద్రప్రభుత్వం లాక్కుందని విమర్శించారు. 'గతంలో కార్మికులకు ఇచ్చిన రక్షణ తీసేశారు. వారిని దోపిడీ చేసేందుకు పరిశ్రమ యజమానులకు కొత్త మార్గాలు తెరిచారు. ఈ చట్టాలతో నరేంద్ర మోడీ పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక మనస్తత్వం మరోసారి స్పష్టమైంది. దేశం ఈ చట్టాలను అంగీకరించదు' అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, సిపిఎం ఎంపిలు కె రాధాకృష్ణన్, వి శివదాసన్, రహీమ్, ఎస్ వెంకటేశన్, డిఎంకె ఎంపిలు కనిమొళి, ఎ రాజా, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపి సుదామ ప్రసాద్, టిఎంసి ఎంపి డోలాసేన్ తదితరులు పాల్గొన్నారు. లేబర్ కోడ్లపై చర్చ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు.

# వరిగడ్డికి భలే గిరాకి.. ట్రాక్టర్‌కు రూ.15వేలు



**నంద్యాల, పతాకం న్యూస్:** ఈ సంవత్సరం రైతులు వరి పంటను తక్కువగా సాగు చేయడంతో వరిగడ్డికి భలే గిరాకీ ఏర్పడింది. ట్రాక్టర్ వరిగడ్డి 13 వేల నుండి 15 వేల ధర పలుకుతుంది. బనగానపల్లె మండలంలో ఈ సంవత్సరం పరమటి పల్లెల్లో వరి సాగును తక్కువగా సాగు చేశారు. రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పత్తి, కంది పంటలను సాగు చేయడంతో పశుగ్రాస కొరత ఏర్పడింది. దీంతో ఎస్ఆర్బిసి కాలువ కింద , కుందు క్రింద, కేసీ కెనాల్, తెలుగు గంగ కాలువల కింద వరి సాగుచేసిన రైతుల నుండి వరిగడ్డిని పశుగ్రాసం కోసం పాడి రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వరిగడ్డికి గిరాకీ ఏర్పడింది.. ప్రతిరోజు 20 నుండి 30 ట్రాక్టర్లలో పశుగ్రాసం కోసం వరిగడ్డిని పాడి రైతులు కొనుగోలు చేసి బనగానపల్లె నుండి తరలిస్తున్నారు. ఎకరా వరిగడ్డి రూ 2500 లకు కొనుగోలు చేసి ట్రాక్టర్ ద్వారా సొంత గ్రామాలకు తరలించడానికి కూలీలతో డాక్టర్ బాడుగతో రూ 13 వేల నుండి 15 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. ప్రాణానికి సమానంగా పెంచుకున్న పశువులను అమ్ముకోలేక వరిగడ్డి ఎక్కువ రేటు పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. వేసవికాలంలో పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతుందని దీంతో అధిక రేటు పెట్టి వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నట్లు పశువుల యజమానులు తెలిపారు. గతంలో వరిని కూలీలతో కోసి కట్టలు కట్టి పంటలు నూర్పు చేయడంతో గడ్డి అధికంగా పడేది వరిగడ్డి పశువుల దానాగా ఉపయోగపడేది. అయితే ఇటీవల యంత్రాలు రావడంతో యంత్రాలతో వరిని కోయడంతో గడ్డి తక్కువగా వస్తుంది. దీంతో రైతులు వరిగడ్డిని అధిక రేటు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. తుఫాన్ కారణంగా వరి పొలాలలో నీరు నిలవడం, కోసిన వరిగడ్డి వర్షానికి తడిసి కుళ్ళి పోవడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగింది . మండలంలోని పడమటి పల్లెల్లో వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో బోర్లలో నీరు లేక వరి పంట సాగు చేయడం లేదు దీంతో పరమటి పల్లెల్లో వరిగడ్డి కొరత ఏర్పడింది. రైతులు ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజన్న, కంది, పత్తి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నడంతో పశుగ్రాస కొరత ఏర్పడుతుంది.

# రాత్రి నిద్రపట్టడం లేదా?



"ఉదయం నిద్ర లేచినప్పట్నుంచి తెలియని అలసట. ఆఫీసులో ఒకటే ఆవలింతలు. నిద్ర ముంచుకొచ్చేస్తున్న భావన." పగటి పూట ఎదురయ్యే ఇబ్బందులు ఇవి. ఇక రాత్రి విషయానికి వస్తే.. ఎంత ట్రై చేసినా అసలు నిద్రే రాదు! పగలంతా చిరాకు.. రాత్రంతా జాగారం. ఇదీ చాలా మంది ఎదుర్కొనే ఇబ్బంది. మెనోపాజ్ కాకపోయినా, పీరియడ్స్ దగ్గర్లో లేకపోయినా ఇలాంటి సమస్యలు ఫేస్ చేస్తుంటారు. మరి, ఎందుకిలా అవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం! పనులన్నీ ముగించుకున్నాం అని అనుకుంటారు మహిళలు. కానీ.. మనసులో మాత్రం ఆ రోజుకు సంబంధించిన సంఘటనలు, రేపు చేయాల్సిన పనులు, ఇలాంటివి ఆలోచిస్తుంటారట. ఈ ఆలోచనలతో బుర్ర నింపేస్తే ఇక నిద్రెలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు నిపుణులు. అందుకే పని అవ్వగానే ఓ పది నిమిషాలు కూర్చోవాలని, ఆ రోజు జరిగినవి ఏమైనా ఉంటే ఆలోచించుకోవాలని చెబుతున్నారు. గుర్తుంచుకోవాల్సినవి, మరుసటి రోజు మర్చిపోతాం అనుకున్నవి ఓ పుస్తకం పెట్టుకుని రాసుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే, బుర్ర ఖాళీ అవుతుందని, నిద్ర బాగా పడుతుందని సలహా ఇస్తున్నారు. పని అవ్వడం మాత్రమే ప్రామాణికం కాకూడదని అంటున్నారు నిపుణులు. నిత్యం ఒకే సమయానికి పడుకోవాలని సూచిస్తున్నారు. లేకపోతే సర్కాడియన్ రిథమ్ (జీవగడియారం) దెబ్బతింటుందని చెబుతున్నారు. రోజుకో తీరు సమయానికి పడుకుంటే.. ఒకవేళ అప్పటికి నిద్రపట్టినా మెలకువ వస్తే మళ్లీ రమ్మన్నా నిద్ర రాదని తెలియజేస్తున్నారు. అందుకే, నిద్ర వేళలు పాటించాలని పేర్కొంటున్నారు. ఒకే వేళకి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకోవాలని తెలియజేస్తున్నారు. అలాగే, వారాంతాల్లో కూడా ప్రతిరోజూ లాగే ఒకే సమయంలో మేల్కొని నిద్రపోవడం అలవాటు చేసుకోవాలని అధ్యయనం పేర్కొంది. ఇలా చేస్తే అసలు నిద్ర సమస్యలు ఉండవట. 'ఉద్యోగినులకు ఆఫీస్ వర్క్ ఒత్తిడి ఉంటుంది. ఇంట్లో ఉండే మాకేంటి?' చాలామంది గృహిణుల ఆలోచన ఇదే. కానీ, ఒత్తిడికి ఎవరూ అతీతులు కాదంటున్నారు నిపుణులు. భుజాలు బిగుసుకున్నట్లుగా అనిపించడం, ఏవేవో ఆలోచనలు చుట్టుముట్టడం, అస్తమానూ అసౌకర్యంగా ఉండటం ఇవన్నీ ఒత్తిడి సంకేతాలని చెబుతున్నారు. శరీరంలో కార్టిసాల్ విడుదలకు చిహ్నాలని పేర్కొంటున్నారు. ఇలాంటప్పుడు మీకు ఏమవుతుందోనన్న కంగారొద్దని, అలాగే పడుకునీ ఉండొద్దని సూచిస్తున్నారు. దీర్ఘశ్వాసలు తీసుకుని వదలడం, ధ్యానం, కొద్దిసేపు నడక, స్ట్రెచింగ్, యోగా వంటివి ప్రయత్నించాలని తెలియజేస్తున్నారు. ఇవన్నీ శరీరాన్నీ మనసునీ నెమ్మదింపచేస్తాయని, సుఖనిద్రకు కారణమవుతాయని వివరిస్తున్నారు. నిద్రమీద సూర్యుడి వెలుగూ ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. ఇది మెలటోనిన్ అనే హార్మోన్ విడుదలకు కారణమవుతుందని చెబుతున్నారు. ఈ హార్మోన్ పగటివేళ అలర్ట్?గా ఉంచి, రాత్రివేళ నిద్రకు కారణమవుతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి, ఉదయాన్నే 15-30 నిమిషాలు ఎండలో గడపాలని, ఇది మెదడుకి పగలన్న సంకేతాలను పంపుతుందని పేర్కొంటున్నారు. దీంతో రాత్రివేళ చక్కని నిద్రకు కారణమవుతుందని సూచిస్తున్నారు. పగలు చురుకుగా ఉండేలా చేయడం, రాత్రి చక్కని నిద్ర వచ్చేలా చేయడం.. వ్యాయామం ప్రత్యేకత. శారీరక శ్రమ లేకపోయినా బద్ధకంగా, అలసిపోయినట్లుగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే రోజూ కొద్దిసేపు నచ్చిన వ్యాయామం చేయాలంటున్నారు. సరదాగా పాటలు పెట్టుకుని కాలు కదిపినా సరే! కానీ ఏదో ఒకటి చేయడం మాత్రం తప్పనిసరని పేర్కొంటున్నారు. అయితే, పగలే చేయాలని, నిద్రకు ముందు చేస్తే శరీరం ఉత్తేజితమై నిద్రపట్టదని తెలియజేస్తున్నారు. మంచి నిద్ర అలవాట్లు, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం వంటి ఇతర జీవనశైలి మార్పులు చేసుకోవాలని అధ్యయనం పేర్కొంది.

చాలామంది బెడ్ రూంలో వస్తువులను చిందరవందరగా ఉంచుకుంటారు. మంచం మీద మడత వేయాల్సిన దుస్తులు, పక్కనే లాప్‌టాప్, బొమ్మలు ఇవీ నిద్రకు భంగం కలిగిస్తాయంటున్నారు నిపుణులు. ఆటలు, పని గుర్తుచేసే ఏ వస్తువైనా మెదడుని విశ్రాంతి తీసుకోనివ్వవని చెబుతున్నారు. అందుకే, మంచం మీద వేటినీ ఉంచొద్దని పేర్కొంటున్నారు. ముఖ్యంగా పని, ఆటలకు సంబంధించిన వాటికి పడక గదిలో చోటివ్వొద్దని సూచిస్తున్నారు. గజిబిజి మంచమూ నిద్రకు శత్రువు అని, దాన్నీ ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. డిమ్ లైట్, సువాసనలతో కూడిన డిఫ్యూజర్ ఇంకా సేదతీరేంత చల్లగా బెడ్?రూం ఉండేలా జాగ్రత్త తీసుకోవాలంటున్నారు.

# జుట్టు పలచబడుతోందా?



ఒత్తైన, పొడవాటి, పట్టులాంటి జుట్టు కావాలని కోరుకోని అమ్మాయి ఉండదు. కానీ బిజీబిజీ లైఫ్‌స్టైల్, ఒత్తిడి, ఆందోళన, విశ్రాంతి లేకపోవడం, కాలుష్యం, పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యల కారణంగా.. చాలా మంది అమ్మాయిలు జుట్టు రాలే సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కొంతమందికి హెయిర్ ఫాల్ ఎక్కువగా ఉండటం వల్ల జుట్టు పలుచబడి.. నుదురు కనిపిస్తూ ఉంటుంది. దీని కారణంగా వారి కాన్ఫిడెన్స్ దెబ్బ తింటూ ఉంటుంది. మీ జుట్టు పలుచబడితే.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, తిరిగి ఒత్తైన జుట్టు రావాలంటే ఎలాంటి టిప్స్ ఫాలో అవ్వాలో ఈ స్టోరీ చదవండి. జుట్టు రాలడం తగ్గి, తిరిగి దృఢంగా పెరగాలంటే.. పోషకాహారం కీలక పాత్ర పోష్తింది. మీ జుట్టు ఆరోగ్యంగా, దృఢంగా పెరగాలంటే.. విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోండి. మీ డైట్‌లో ఆకు కూరలు, గుడ్లు, చేపలు, నట్స్, విత్తనాలు, పండ్లను చేర్చుకోండి. హెయిర్ ఫోలికల్స్‌కి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడానికి మీ స్కాల్ప్‌ను క్రమం తప్పకుండా మసాజ్ చేయండి. ఇది జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ప్రతి రోజు 15 నిమిషాల పాటు.. మీ తలను వేళ్లతో సున్నితంగా మసాజ్ చేయండి. మసాజ్ హెయిర్ ఫాలికల్స్‌ను ఉత్తేజపరచడంతో పాటు ఒత్తిడిని తగ్గిస్తుంది. జుట్టు రాలడానికి ఒత్తిడి కూడా ఓ కారణం.? గుడ్లలో ఉండే ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ జుట్టుకు పోషణ అందిస్తాయి, జుట్టు రాలే సమస్యలను దూరం చేస్తాయి. కోడిగుడ్డులోని తెల్లసొన తీసుకొని బాగా గిలక్కొట్టాలి. దానిని కుదుళ్లకు చేరేలా పట్టించి 20 నుంచి 30 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీరు, గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేయాలి. ఈవిధంగా వారానికోసారి క్రమం తప్పకుండా చేయడం వల్ల ఒత్తైన జుట్టు మీ సొంతం అవుతుంది.

కొబ్బరి పాలు.. జుట్టు సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ఎఫెక్టివ్‌గా పనిచేస్తాయి. కొబ్బరిపాలలో క్యాల్షియం, ఐరన్, ఫాస్పరస్, విటమిన్ ఎ, సి, ఇ, సహజ ప్రొటీన్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. తాజా కొబ్బరి పాలను తలకు అప్లై చేసి 30 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే.. జుట్టు రాలడం తగ్గి, కొత్త జుట్టు రావడం మొదలవుతుంది.

కలబంద జుట్టుకు పోషణ అందించి పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. కలబంద తలలో సమతుల్యం చేస్తుంది, ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. తాజా కలబంద గుజ్జును జుట్టుకు, కుదుళ్లకు అప్లై చేసి 30 నుంచి 40 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి క్రమం తప్పకుండా చేస్తే.. మంచి రిజల్ట్స్ ఉంటాయి. గ్రీన్ టీలోని పోషకాలు.. జుట్టును ఆరోగ్యంగా, దృఢంగా ఉంచడానికి సహాయపడతాయి. గ్రీన్ టీ తయారు చేసి.. ఆది చల్చండి. మీరు తలస్నానం చేసిన తర్వాత.. మీ జుట్టును దానితో శుభ్రం చేసుకోండి. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రాలడం తగ్గిస్తాయి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. అదనంగా, ఇది జుట్టుకు మెరుపును జోడిస్తుంది, హెయిర్ మెయింటెనెన్స్ సులభం చేస్తుంది.?

# రాయితీలు ఒకరికి.. భూములు మరొకరికి



**అమరావతి, పతాకం న్యూస్:** విశాఖలో భారీగా ఐటి పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు కావాల్సిన భూము లను మాత్రం వేరే సంస్థలకు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. డేటా సెంటర్ అభివృద్ధి కోసం ఒక సంస్థకు రాయితీలు వకటించిన ప్రభుత్వం.. భూములను మాత్రం అదాని సంస్థలకు కేటాయించడం గమనార్హం. ఇది అదాని సంస్థపై దశాబ లుగా చూపిస్తున్న అవ్యాజమైన ప్రేమకు కొసమెరుపుగా కనిపిస్తోంది. విశాఖలో ఎఐ డేటా సెంటర్ను భారీ పెట్టుబడితో ఏర్పాటుచేసేందుకు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును రైడన్ ఇ న్ఫోటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్కు ఖరారు చేశారు. 15 బిలియన్ డాలర్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేం దుకు రైడన్ నిర్ణయించింది. అయితే ఈ సంస్థకు భూమి కేటాయించాల్సిన నేపథ్యంలో ఇచ్చిన ఉత్తర్వులు మాత్రం అదా నికి ఇచ్చినట్లుగా ఉండడం, అదానికి చెందిన మూడు సంస్థలు రైడన్లో భాగస్వాములుగా ఉన్నట్లు చూపించారు. ఈ స ంస్థలకే ఏకంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలను కేటాయించారు. విశాఖ జిల్లాలోని అడవివరంలో 120 ఎ కరాలు, అదే జిల్లాలోని ఆనందపురం మండలంలోని తర్లు వాడలో 200 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో 160 ఎకరాలను రైడన్ సంస్థకు కేటాయించారు. అయితే రైడన్ పేరున ఉన్న సంస్థలో ఆరు ఇతర సంస్థలు భాగస్వాములు గా ఉన్నట్లు చూపించారు. అందులో మూడు సంస్థలు అదానికి చెందినవే. అదాని ఇన్ఫ్రా ప్రైవేటు లిమిటెడ్, అదాని కా నెక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, అదాని పవర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు కీలక భాగస్వాములుగా ఉన్నట్లు చూపించారు. భారతీ ఎయిర్టెల్, భారతీకి అనుబంధ సంస్థగా ఉన్న ఎక్స్ట్రా డేటా లిమిటెడ్, ఎన్ వైజాగ్ లిమిటెడ్ లు ఇతర భాగస్వామ్య సంస్థలుగా ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటిల్లో ప్రధాన భాగస్వామిగా చెబుతున్న అదాని ఇన్ ఫ్రాకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది.

రాంబిల్లిలో భూమిని ఎన్ క్స్ట్రా సంస్థకు కేటాయించగా, దానిని రైడ న్ కోసం డేటా సెంటర్ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తర్లువాడ, అడవివరంలో భూములను అదాని కానెక్స్ లేదా దానికి అనుబంధ సంస్థలకు ఇచ్చేలా నిర్ణయించడం గమనార్హం. రూ. లక్ష కోట్లు పెట్టుబడిగా చెబుతున్న గూగుల్ డేటా సెంటర్ను రైడన్ సంస్థే నిర్వహించనున్నట్లు కనిపిస్తోంది. రైడన్, దాని అనుబంధ సంస్థలే గూగుల్, గూగుల్ క్లౌడ్ నిర్వహణ చేస్తారని ఐటి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది . అయితే ప్రధానంగా రైడన్తో ఒప్పందం చేసుకున్న ప్రభుత్వం భూములను మాత్రం అదానికి చెందిన సంస్థలకు ఇవ్వడ 0 చర్చనీయాంశంగా మారింది. అదానితో ప్రభుత్వానికి అంతర్లీనంగా అనుబంధం ఉండటం, అందులో రాష్ట్రంలో ఉన్న విద్యుదుత్పత్తి సంస్థల్లో అదానికే ఎక్కువ వాటా ఉండడం తెలిసిందే. ఇప్పుడు డేటా సెంటర్లలోనూ అదాని సంస్థకు ప్రాధాన్యత ఇవ్వడం గమనిస్తే.. ప్రభుత్వ పెద్దల సహకారం వల్లనే ఇది సాధ్యమవుతోందన్న విమర్శలు కూడా ఉన్నాయి.

# ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం: రేవంత్‌రెడ్డి



**ఆదిలాబాద్, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడిన తర్వాత అదిలాబాద్ వేదికగా ప్రకటన చేస్తున్నానని, సంవత్సరం తిరిగేలోగా ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులను ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో రూ.260 కోట్లతో అభివద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, తాను రెండేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని అన్నారు. విపక్ష నేతలను కలుపుకుని తాము ముందుకు పోతున్నామని ఆయన అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి విపక్ష ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు తాము ప్రతిపక్షాలతో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించానని, దేశంలోని ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించుకుని ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తాను కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కావొచ్చు.. కానీ కేంద్రం సహకారంతో ముందుకు సాగాలని, అందుకే మోదీతో మాట్లాడిన తర్వాత విమానాశ్రయంపై ప్రకటన చేస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. ఎర్రబస్సు కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు తీసుకు వచ్చి, పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటామని హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే రెండు నెలల్లో అభివృద్ధి ప్రణాళికతో మళ్లీ వస్తానని, అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆదిలాబాద్‌ను ఆదర్శ జిల్లాగా చేస్తానని అన్నారు. కన్నతల్లితో సమానమైన సోనియా గాంధీ ఆశీర్వాదం తీసుకుని తాను ఇక్కడకు వచ్చానని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో సున్నపు గనులు ఉన్నాయని, కాబట్టి ఇక్కడకు పరిశ్రమను తీసుకువచ్చి వ్యాపార కేంద్రంగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు.




# వరల్డ్ కప్-2025లో భారత్‌కు తొలి పరాజయం



వరల్డ్ కప్-2025లో భారత్‌కు తొలి పరాజయం ఎదురైంది. జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్ లో భాగంగా జర్మనీ , భారత్‌తలపడ్డాయి. గ్రూప్-సి లో జరిగిన ఈ లీగ్ మ్యాచ్ లో భారత్ 1-3 గోల్స్ తేడాతో జర్మనీ( చేతిలో ఓడింది. ఇండియా తరఫున హీనా బానూ మాత్రమే 58వ నిమిషంలో ఒక్కే ఒక గోల్ చేసింది. ఆ తర్వాత ఎవరూ కూడా గోల్ సాధించక లేకపోయారు. మరోవైపు జర్మనీ జట్టుకు లీనా ఫ్రెరిచ్స్ 5వ నిమిషంలో, అనిక షానాఫ్ 52వ నిమిషంలో, మార్టినా రీసెంగర్ 59వ నిమిషంలో తలో గోల్ అందించారు. అలానే మ్యాచ్ మొత్తంలో భారత్‌కు ఏడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అయితే ఒక పెనాల్టీని మాత్రమే సద్వినియోగం చేసుకుంది. మరోవైపు జర్మనీ జట్టుకు తొమ్మిది పెనాల్టీ కార్నర్‌లు, ఒక పెనాల్టీ స్ట్రోక్ లభించాయి. వాటిల్లో మూడిటిని జర్మనీ జట్టు సద్వినియోగం చేసుకుంది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో ముగుస్తుందనగా.. భారత పట్టుకోల్పోయి రెండు గోల్స్ సమర్పించుకుంది. నాలుగు జట్లున్న గ్రూప్ 'సి'లో జర్మనీ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఆరు పాయింట్లతో టాప్ ప్లేస్ లో ఉంది. నమీబియాపై మాత్రమే గెలిచిన భారత్, ఐర్లాండ్ జట్లు మూడు పాయింట్లతో సమానంగా ఉన్నాయి.

# రెండో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం




విరాట్ కోహ్లీ (93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో 102), రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్స్‌లతో 105) శతకాలతో భారత్ భారీ స్కోరు చేసినా.. బౌలర్లు, ఫీల్డింగ్ వైఫల్యంతో కొండంత స్కోరును కాపాడుకోలేకపోయింది. మార్‌క్రమ్ (98 బంతు ల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 110)తోపాటు మిగతా బ్యాటర్లు రాణించడంతో.. బుధవారం హోరాహోరీగా జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 4 వికెట్లతో భారత్‌ను ఓడించింది. మూడు వన్డేల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. తొలుత భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 358/5 స్కోరు చేసింది. రాహుల్ (43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 66 నాటౌట్) రాణించాడు. యాన్సెన్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు చేసి గెలిచింది. బ్రిట్స్‌కే (68), బ్రెవిస్ (54) గెలుపులో కీలకపాత్ర పోషించారు. అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ చెరో 2 వికెట్లు తీశారు. మార్‌క్రమ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఆఖరిదైన మూడో వన్డే శనివారం విశాఖపట్నంలో జరగనుంది. భారీ ఛేదనలో ఓపెనర్ డికాక్ (8)ను అర్ష్‌దీప్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపినా.. మార్‌క్రమ్‌తోపాటు మిగతా బ్యాటర్లు కలిసికట్టుగా ఆడి సౌతాఫ్రికాకు అద్భుత విజయాన్ని అందించారు. 53 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద మార్‌క్రమ్ ఇచ్చిన క్యాచ్‌ను జైస్వాల్ చేజార్చడంతో.. భారత్ భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కెప్టెన్ బవుమా (46)తో కలసి రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్న మార్‌క్రమ్.. బ్రిట్స్‌కేతో కలసి మూడో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపుబాటలో నిలిపాడు. అయితే, సెంచరీ పూర్తి చేసుకొన్న మార్‌క్రమ్‌ను.. 30వ ఓవర్‌లో రాణా స్లో బంతితో బోల్తా కొట్టించడంతో.. భారత్ ఊపిరి పీల్చుకొంది. అప్పటికి సౌతాఫ్రికా విజయానికి 20 ఓవర్లలో ఇంకా 162 రన్స్ కావాలి. ఈ దశలో బ్రిట్స్‌కే, బ్రెవిస్ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. ఈ క్రమంలో బ్రిట్స్‌కే హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. 40వ ఓవర్‌లో రాణా బౌలింగ్‌లో బ్రెవిస్ రెండు వరుస సిక్స్‌లతో గేర్ మార్చాడు. దీంతో లక్ష్యం చివరి 60 బంతుల్లో 77 పరుగులకు దిగివచ్చింది. అయితే, సిక్స్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న బ్రెవిసను కుల్దీప్ క్యాచవుట్ చేశాడు. బ్రిట్స్‌కేను ప్రసిద్ధ్.. యాన్సెన్ (2)ను అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో కొంత ఉత్కంఠ రేగినా.. జోర్జి (17 రిటైర్డ్ హర్ట్), బాష్ (29 నాటౌట్), కేశవ్ (10 నాటౌట్) 4 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (22), రోహిత్ (14) దూకుడైన ఆరంభాన్నిచ్చారు. ఐదో ఓవర్‌లో బర్గర్ బౌలింగ్‌లో 3 ఫోర్లు బాదిన రోహిత్.. అదే ఓవర్‌లో అవుటవగా.. జైస్వాల్ మరోసారి యాన్సెన్ బౌన్సర్‌కు బోల్తాపడ్డాడు. అయితే, కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు చేసింది. కోహ్లీ, గైక్వాడ్ చక్కని సమన్వయంతో వికెట్ల మధ్య పరిగెత్తడంతోపాటు వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో 15 ఓవర్లు ముగిసే సరికి టీమిండియా 96/2తో నిలిచింది. గత మ్యాచ్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగిన గైక్వాడ్ ఈసారి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడు. ఈ క్రమంలో 24వ ఓవర్‌లో మార్‌క్రమ్ బౌలింగ్‌లో రుతురాజ్ సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో కోహ్లీ కూడా అతడిని అందుకొన్నాడు. ఆత్మవిశ్వాసం పెరగడంతో రుతురాజ్ ఒక్కసారిగా గేర్‌మార్చాడు. 28వ ఓవర్‌లో కేశవ్ బౌలింగ్‌లో 4,6,4తో 16 పరుగులు పిండుకొన్న గైక్వాడ్.. ఆ తర్వాతి ఓవర్‌లో మరో రెండు ఫోర్లు కొట్టాడు.




# మహిళలే లక్ష్యంగా ఏఐ

## తీవ్రంగా స్పందించిన రష్మిక మందన్న



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన కంటెంట్‌ను సృష్టించడంపై సినీ నటి రష్మిక మందన్న తీవ్రంగా స్పందించారు. ఇటువంటి చర్యలు సమాజంలో కొందరి నైతిక పతనాన్ని సూచిస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై తన అభిప్రాయాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

ఏఐ సాంకేతికతపై ఆమె స్పందిస్తూ.. "నిజాన్ని కూడా సృష్టించగలిగే ఈ కాలంలో, వివేచన మనకు గొప్ప రక్షణ. ఏఐ అనేది అభివృద్ధికి దోహదపడే ఒక శక్తి. కానీ దానిని మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యతను సృష్టించడానికి వాడటం కొందరిలో లోతైన నైతిక పతనాన్ని చూపిస్తుంది" అని అన్నారు. "ఇంటర్నెట్ ఇకపై వాస్తవానికి అద్దం పట్టదు, అది దేన్నైనా సృష్టించగల ఒక కాన్వాస్‌గా మారింది. ఈ దుర్వినియోగాన్ని మనం అధిగమించాలి. గౌరవప్రదమైన సమాజ నిర్మాణానికి ఏఐని ఉపయోగించుకోవాలి. బాధ్యతగా మెలగడం నేర్చుకోవాలి. మనుషుల్లా ప్రవర్తించని వారికి కఠినమైన, క్షమించరాని శిక్షలు విధించాలి," అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఏఐ డీప్‌ఫేక్‌ల బారిన సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు పడుతున్న సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 'సైక్ సిద్ధార్థ' అలరిస్తుంది : నందు



'నేను ఇండస్ట్రీకి వచ్చి పద్దెనిమిదేళ్లు అయ్యింది. నా నటన గురించి ఇప్పటివరకు నెగెటివ్ కామెంట్స్ రాలేదు. 'సైక్ సిద్ధార్థ' సినిమా నచ్చకపోతే ప్రెస్‌మీట్ పెట్టి ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతా. ఒకవేళ ఫెయిలైనా ఇక్కడే ఉండి సినిమాలు చేస్తా. గెలిచేవరకు ప్రయత్నిస్తూనే ఉంటా. సైక్ సిద్ధార్థ చిత్రకథ ఇప్పుడున్న సొసైటీకి రిలేట్ అయ్యేలా, యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. దర్శకులు రాఘవేంద్రరావు, సాయిరాజేష్, అనుదీప్ గార్లు మా సినిమా చూసి అభినందించారు. ఈ చిత్రం కోసం నేను పద్దెనిమిది కిలోలు తగ్గా. మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అని కథానాయకుడు నందు అన్నారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీ నందు, యామినీ భాస్కర్ జోడీగా నటించిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. రానా స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్‌పై శ్రీ నందు, శ్యామ్‌సుందర్‌రెడ్డి తుడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ట్రైలర్ విడుదల సందర్భంగా శ్రీనందు పై విధంగా మాట్లాడారు.






# 'అఖండ-2' టికెట్ల ధరలు పెంపు



నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ 2' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో బాలయ్య మరోసారి ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్ అన్నీ కలిసి సినిమాపై విశేషమైన హైప్‌ను సృష్టించాయి.

ఇంతకుముందు బాలకృష్ణ–బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన 'సింహ', 'లెజెండ్', 'అఖండ' అన్ని మూడు బ్లాక్‌బస్టర్ హిట్స్. అఖండ తరువాత బాలయ్య చిత్రాల వసూళ్లు రూ.50 కోట్ల నుండి నేరుగా రూ.100 కోట్ల మార్క్ దాటాయి. అఖండతో తొలి సారిగా 100 కోట్ల క్వాలిటీ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఆయన, అనంతరం 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకూ మహారాజ్' చిత్రాలతో వరుసగా నాలుగు సినిమాలు శతకోట్ల వసూళ్లు సాధించిన సీనియర్ హీరోగా రికార్డు సృష్టించారు.

ఇప్పుడు విడుదలకు సిద్ధమైన 'అఖండ 2' కూడా భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు విశ్వాసంగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా, సినిమా రిలీజ్‌కు ముందే తెలంగాణ ప్రభుత్వం ఓ వార్త చెప్పింది. రేపటి ప్రీమియర్ల కోసం సినిమా టికెట్ రేట్లను పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రోజు రాత్రి 8 గంటల నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం అవుతున్నాయి.

Edited, Printed, Published & Owned by LEKKALA SREENU and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at Guddapuvalasa Ramani, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082